# అందమైన మోసం

ప్రేమేంద్ర

గోదావరి ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం విడిచి పెట్టేంది. ఫస్టు క్లాసు కంపార్ట్‌మెంట్ గేటు దగ్గర నిల్చున్న మోహనరావు, తనని సాగనంపడానికి వచ్చిన ఇద్దరు మిత్రులకూ వీడ్కోలు చెబుతూ లోపలికి వచ్చేశాడు. అతనికి ఆ కంపార్ట్‌మెంట్ 'ఇ' కేబిన్‌లో పై బెర్తు రిజర్వు అయ్యింది. ముందే సామాను పెట్టేసి, మిత్రుల్ని సాగనంపి వచ్చాడిప్పుడు. లోపలికి వచ్చే సరికి, కింది బెర్తు మీద కిటికీ దగ్గర ఓ స్త్రీమూర్తి కూచుని వుండటం గమనించి ఆశ్చర్యపోయాడు. తను వున్న కేబిన్‌లో ఆమెకి ఎలా రిజర్వేషన్ దొరికిందా? అని!

మోహనరావుకి కిటికీ దగ్గర కూచుని ప్రయాణం చేయడమంటే మహా సదా. అందుకే ఎప్పుడూ కిటికీ సీటునే కోరుకుంటాడు. కాని ఆ రోజు ఎటువంటి అవకాశాన్ని కోల్పోయినందుకు అతని మనసు చివుక్కుమంది. కిటికీ దగ్గర కూచుని వున్న స్త్రీని, అక్కణ్ణించి లేవమని చెప్పగలిగే ధైర్యం అతనికి లేదు. ఆడవారితో ప్రవర్తించినపుడు ఎంతో సున్నితంగా వుండాలని అతనికి బాగా తెలుసు. అందుకే మౌనంగా వచ్చి బెర్తు మరో చివర ఆశీనుడయ్యాడు.

రైలు వేగాన్ని పుంజుకుని సాగి పోతోంది. ఆమె ఏదో ఇంగ్లీషు పుస్తకం చదువుకుంటోంది. ఆ కేబిన్లో నిశ్శబ్దం ఆవరించింది. ఆమెతో మాట్లాడ్డానికి అతను సాహసించలేకపోయాడు.

అనకాపల్లిలో రైలాగింది. అంత వరకూ పుస్తకం చదువుకుంటూ కూచున్నామె పుస్తకాన్ని మూసేసి, ప్లాట్‌ఫామ్ మీద అరటి పళ్ళు అమ్ముతూ వుంటే అతణ్ణి పిలిచి, అరడజను అరటిపళ్ళు కొన్నదామె. పళ్ళవాడికి పది రూపాయిల నోటిచ్చింది.

"నా దగ్గర అయిదు రూపాయిలు లేవమ్మగారూ!" అన్నాడు అరటి పళ్ళవాడు.

అప్పుడామె మోహనరావుకేసి తిరిగింది.

"ఏవండీ! అరటి పళ్ళు మీరు తీసుకుంటారా?" అందామె.

తుళ్ళి పడ్డట్టయ్యాడు మోహనరావు. 'తననేనా ఆమె ప్రశ్నిస్తోంది?' అన్న సందేహం వచ్చి రెప్పపాటు సమయం విస్తుబోయినా, వెంటనే తేరుకున్నాడు.

"ఆ! నేనూ తీసుకుంటానండీ!" అంటూ కిటికీ దగ్గరికి వెళ్ళి ఆరు అరటి పళ్ళు తీసుకుని పది రూపాయిల నోటిచ్చాడు మోహనరావు.

పళ్ళవాడు తెల్లమొహం వేశాడు.

"మీ ఇద్దరికీ చెరో అయిదు రూపాయిలివ్వాలి. చిల్లర లేదండీ! ఎలా?" అన్నాడు.

అంతలో బండి కూత వినిపించింది.

"సరేనయ్యా! నేను పదిచ్చాను గదా! అది తీసుకో. మేం చూసుకుంటాంలే. ఆయన గారి పది రూపాయిలు ఆయనకిచ్చేయ్" అందామె.

అరటిపళ్ళ వాడు మోహనరావుకి పది రూపాయలిచ్చేసి వెళ్ళిపోయాడు.

రైలు కదిలింది.

"అంటే మీకు నేను అయిదు రూపాయలు ఋణపడ్డానన్నమాట" అన్నాడు మోహనరావు సన్నగా నవ్వుతూ.

ఆమె నవ్వింది. నవ్వుతున్నప్పుడు ఆమె బుగ్గలు సొట్టపడటం గమనించాడు మోహనరావు. ఆమె అందంలో ఓ ప్రత్యేకత కనిపించిందతనికి.

"అలా భావించకండి సార్! తోటి ప్రయాణీకులం. ఒకరికొకరు సహాయం చేసుకోకపోతే ఎట్లా చెప్పండి? తర్వాత కాఫీ వస్తే మీరే ఇచ్చేదురు గాని" నవ్వుతూనే అంది.

ముత్యాలు పొదిగినట్టున్న ఆమె పలువరస తళుక్కుమంది.

"సరే! అలాగే చెద్దాం లెండి!" అంటూ తన సీటుకొచ్చి కూచున్నాడు మోహనరావు.

"మీరూ హైదరాబాదేనండీ?" అడిగిందామె.

"నేనూ అక్కడికే!"

"మనం విశాఖపట్నం విడిచిపెట్టిన దగ్గర్నుంచీ, అనకాపల్లి వచ్చిన వరకూ మౌనంగా వుండటం ఆశ్చర్యంగా లేదూ?" అన్నాడు మోహనరావు.

ఆమె ముసిముసిగా నవ్వింది.

"నిజంగా ఆశ్చర్యం సుమండీ! సాధారణంగా మగాళ్ళే చొరవ తీసుకుని ముందు మాట్లాడతారు. అదే నేనూ ఆశించానండీ!"

"మీరన్నదీ నిజమేనండీ! నేనే మాట్లాడదామని అనుకున్నాను. కాని మీరు ముభావంగా వుంటూ పుస్తకం చదువుకుంటూ వుంటే, మీరు ఏమనుకుంటారోనని సందేహించి పలకరించలేదండీ!!"

మోహనరావు సమాధానంతో అతని మనస్తత్వాన్ని ఇట్టే అంచనా వేసుకోగలిగిందామె.

"విశాఖలో మీరు ఏం చేస్తుంటారు?"

'ప్రైవేటు కంపెనీలో ఇంజనీరుగా పని చేస్తున్నానండీ. మరి మీరు?"

"హైదరాబాద్‌లో ఓ బ్యాంకులో పని చేస్తున్నాను"అందావిడ.

"ఈ రోజుల్లో బ్యాంకు ఉద్యోగాలకి మంచి గిరాకీ వుందండీ".

'ఆ ఏదో లెండి. అందరూ అలా అనుకుంటారు గాని, మాకున్న ఇబ్బందులు మాకున్నాయండీ. ఇంతకీ మీ పేరు చెప్పారు కాదు?" అందామె.

"మోహనరావండీ" చెప్పాడు.

"మరి నాపేరు తెలుసుకోవాలని లేదా? జడ ముందుకు తీసుకుంటూ అందామె.

"మీరు ఎలాగూ చెప్తారని అడగలేదు. ఇప్పుడు చెప్పండి".

"నా పేరు లతిక".

"బావుందండీ! ఈ పేరు చాలా తక్కువగా వింటూ వుంటాం. అన్నట్టు మీ వారేం చేస్తుంటారు?"

"లెక్చెరరండీ".

"అలాగా! అయితే మీది ఓ అంతస్తు గల కుటుంబం అన్నమాట!"

'ఆ! ఏదో లెండి. మాకు ఒక్కడే అబ్బాయి. పదేళ్ళవాడు. వాడి చదువు మీదే మా దృష్టం తానూ".

"చాలా అదృష్టవంతులండీ" అన్నాడు మోహనరావు.

లతిక నవ్వింది. ఆమె నవ్వు, గలగల పారే సెలయేరులా వుంది.

కేబిన్ తలుపు తట్టారెవరో.

"చూడండి సార్ ఎవరో?" అంది లతిక.

మోహనరావు వెళ్ళి తలుపు తీశాడు.

"కాఫీ సార్" కాఫీ కేన్‌తో ప్రత్యక్షమయ్యాడు కేటరింగు వ్యక్తి.

"కాఫీ తీసుకుందామాండీ?" లతికని అడిగాడు మోహనరావు.

"తీసుకుందాం" అందామె.

"రెండు కాఫీలివ్వు" అంటూ లోపలికి వచ్చేశాడు మోహనరావు.

కేటరింగ్ బోయ్ రెండు ప్లాస్టిక్ గ్లాసులతో కాఫీలు అందించాడు. మోహనరావు పది రూపాయిల నోటు అందించి మిగిలిన చిల్లర తీసుకున్నాడు. కాఫీ బోయ్ వెళ్ళిన వెంటనే తలుపు వేసి, తన సీటులో వచ్చి కూర్చున్నాడు మోహనరావు.

"కాఫీ వేడిగా, రుచిగా వుందండీ" అంది లతిక కాఫీ సిప్ చేస్తూ.

"ఔనండీ!" ముక్తసరిగా అన్నాడు మోహనరావు.

"అయితే ఋణం తీర్చుకున్నారన్నమాట" నవ్వుతూ అంది లతిక.

"పూర్తిగా కాదు లెండి".

"అదేవిటి? మీరు అతడికి పది రూపాయల నోటు ఇచ్చారు కదా?" ఆశ్చర్యంగా అందామె.

"ఔను కాని, వాడు రెండు రూపాయిల నోటు తిరిగి ఇచ్చాడు కదండీ!"

"ఓ! అందుకా అంటున్నారు! భలే వారే!" అంది ముసి ముసిగా నవ్వుకుంటూ.

మళ్ళీ తలుపు తట్టారెవరో.

"అబ్బ ఇదేం గోలండీ బాబూ" విసుగ్గా అంది లతిక.

మోహనరావు వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా కండక్టర్.

"టికెట్స్ ప్లీజ్" అన్నాడు కండక్టర్ లోపలికి వచ్చి.


మోహనరావు, లతిక విడి విడిగా రిజర్వేషన్ టికెట్లను అందించారతనికి. వాటిని రిజర్వేషన్ చార్జితో బేరీజు వేసుకుని, వాటి మీద సంతకం పెట్టి వారికి తిరిగి ఇచ్చివేశాడు కండక్టరు.


"మేడమ్, మీకు ఎటువంటి ఇబ్బందీ లేదు కదండీ!" లలితను వుద్దేశించి అన్నాడు కండక్టరు.

"నాటెటాల్..థాంక్యూ.." అంటూ ఆమె మళ్ళీ ముసి ముసి అస్త్రం వేసింది.

"వెల్‌కమ్" అంటూ నిష్క్రమించాడు కండక్టరు.

మోహనరావు తలుపు వేసి వచ్చేడు.






రాజమండ్రి స్టేషన్లో బండి ఆగింది.

'మీకు ఏమన్నా కావాలా ఏవిటండీ?" అడిగాడు మోహనరావు.

"నాకేమీ వద్దండీ. టిఫిను, మంచి నీళ్ళూ వున్నాయి. నా దగ్గరున్న టిఫిను మనిద్దరికీ సరిపోతుంది లెండి".

"నేను పూరీలు తెచ్చుకున్నానండీ" అన్నాడు మోహన రావు.

రైలు కదిలింది. వేగాన్ని అందుకుంది. ప్యాకెట్లు బయటికి తీశారు. రెండు రకాల టిఫిన్లను ఇద్దరూ ఆరగించారు. మంచి నీళ్ళు తాగారు. అనకాపల్లిలో కొనుక్కున్న అరటి పళ్ళు తినేశారు.

"ఇప్పుడు ఎంతో హాయిగా వుందండీ!" అంది లతిక తృప్తిగా.

"ఔనండీ! ఇంటి దగ్గర భోంచేసినట్టే వుంది మనమండీ" అన్నాడు మోహనరావు.

కిటికీ లోంచి చల్లని గాలి వీస్తోంది. కాస్తంత చలిగా వున్నట్టనిపించింది లతికకి.

"కిటికీ తలుపు వేసేస్తున్నానండీ" అంది.

"క్రింది బెర్తు మీద పడుకోవలసిన వారు మీరు. కిటికీ తలుపు వేసేయడం, మానేయడం- అది మీ ఇష్టం' నవ్వుతూ అన్నాడు మోహనరావు.

"లతిక గారూ! నాకు రిజర్వు అయిన పై బెర్తు మీదికి వెళ్ళిపోతున్నానండీ" అన్నాడు మోహనరావు.

'ఓ.కే!! వెళ్ళండి మాస్టారూ! నాకు తోడుగా వుంటూ ప్రయాణం చేసినందుకు మీకు థాంక్సు చెప్పుకోవాలండీ" అంది లతిక.

"నేనూ అట్లాగే అనుకోవాలి కదండీ! ఎనీవే గుడ్‌నైట్" అంటూ పై బెర్తు మీదికి వెళ్ళిపోయాడు మోహనరావు.

"గుడ్‌నైట్ సర్" అంది లతిక.

కాసేపట్లోనే ఇద్దరికీ నిద్ర పట్టేసింది.

* * *

గోదావరి ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ చేరుకుంది. ఎవరో రైల్వే సిబ్బంది వచ్చి లేపే వరకూ మోహనరావుకి మెలకువ రాలేదు. బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ లేచి కిందికి దిగాడు. మత్తుగా వున్నట్టనిపించిందతనికి.

"హైదరాబాద్ వచ్చి అంతా దిగి వెళ్ళిపోయినా, మీరింకా హాయిగా నిద్రపోతున్నారేమిటి సార్" అడిగాడు రైల్వే ఉద్యోగి.

మోహన రావు సిగ్గుపడిపోయాడు.

"ఏమిటో మత్తుగా వుందయ్యా" అంటూ తన సూట్‌కేస్ కోసం వెతికాడు. అది కనిపించలేదు. ఆ తరువాత చూస్తే మెడలో బంగారం గొలుసు లేదు. చేతికుండే రెండు వుంగరాలూ మాయమయ్యాయి. ఆతృతగా ప్యాంటు జేబులో చేయి పెట్టాడు. పర్సూ లేదు.

మోహనరావుకి మతి పోయినట్టయ్యింది.

"మోసం...దగా..దొంగతనం" పిచ్చిగా అరిచాడు.

"ఏమయ్యింది సార్!" విస్తుపోతూ ప్రశ్నించాడు ఆ రైల్వే ఉద్యోగి.

"నా సూట్‌కేసూ, బంగారవు గొలుసు, వుంగరాలూ, నా పర్సూ అన్నీ పోయాయి. నాతో ప్రయాణం చేసిన ఆ లేడీయే పట్టుకుపోయి వుండాలి" అంటూ వాపోయాడు.

"ఇటువంటి కేసులు ఈ మధ్యనే వింటున్నాం సార్! వెళ్ళి జి.ఆర్.పి. ఆఫీసులో రిపోర్టివ్వండి" అన్నాడు రైల్వే ఉద్యోగి.

కట్టుబట్టలతో మిగిలిన మోహనరావు దిగాలు పడుతూ కిందికి దిగాడు. నేరుగా జి.ఆర్.పి. ఆఫీసుకి వెళ్ళి రిపోర్టు రాసిచ్చాడు.

"వివరాలన్నీ ఇందులో ఇచ్చారా?" అడిగాడు ఇన్‌స్పెక్టరు.

"ఇచ్చానండీ! నా అడ్రస్ కూడా ఇచ్చాను "

"ఇటువంటి కేసుల్లో ఇది మూడవది సార్. దీని వెనుక ఏదో ఒక ముఠా పని చేస్తున్నదనిపిస్తోంది. వీళ్ళని పట్టుకోవడానికి మా ప్రయత్నాలు ముమ్మురం చేస్తాం. ఆపైన మీ అదృష్టం" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

మోహనరావుకి ఏమనాలో తోచలేదు.

"సరే ఇన్‌స్పెక్టర్ గారూ! మీ ప్రయత్నం మీరు చేయండి. అదృష్టవశాత్తూ ఏం దొరికినా నాకు తెలియపర్చండి. సిటీలో మా బంధువుకి ఫోన్ చేయాలి. ఓసారి ఫోను చేసుకోచ్చా?" అన్నాడు మోహనరావు.

"నంబర్ తెలుసా?"

"టెలిఫోన్ నంబర్ నోట్ చేసుకున్నా పుస్తకం టిక్కెట్టు వదిలేసింది లెండి" అంటూ జేబు లోంచి చిన్న నోట్‌బుక్ తీశాడు.

"ఇదిగోండి. ఇది పబ్లిక్ టెలిఫోను. మీరు ఫోను చేయండి" అంటూ ఫోను ముందుకు తోశాడు ఇన్‌స్పెక్టరు.

మోహనరావు ఫోన్ చేశాడు. అదృష్టవశాత్తూ ఆ బంధువు ఇంట్లోనే వున్నాడు. మోహనరావు జరిగిందంతా చెప్పాడు. అతణ్ణి వెంటనే రమ్మని చెప్పి రిసీవర్ని క్రెడిల్ మీద పెట్టేశాడు.

"థాంక్సు ఇన్‌స్పెక్టర్ గారూ. ఫస్టు క్లాసులో ప్రయాణాలు కూడా ప్రమాదకరంగా వుంటాయని ఎవరూహించారండీ! నా దురదృష్టం" అన్నాడు మోహనరావు.

'నిజంగా నేను ఎంతో చింతిస్తున్నాను సార్! రోజులు మారిపోతున్నాయ్. ఏం చేస్తాం. మీ బంధువు వస్తానన్నారా?"

"వస్తున్నాడండీ! మెయిన్ గేటు దగ్గర నిల్చోమన్నాడు. వస్తానండీ" అంటూ అక్కణ్ణుంచి నిష్క్రమించాడు.

'పూర్ ఫెలో' అనుకున్నాడు తనలో తనే ఇన్‌స్పెక్టరు.

మోహనరావుని చూసి మెయిన్ గేటు దగ్గర నిల్చున్న బంధువు చేయి వూపాడు. మోహనరావు బైటికి నడిచాడు.